బంగారు దుకాణంలో చోరీ

550 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.60 వేల నగదు అపహరణ

ముసునూరు :బంగారు దుకాణంలో చోరీకి పాల్పడిన ఆగాంతకులు బంగారు ఆభరణాలు, నగదు అపహరించుకుపోయరు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రమణక్కపేట గ్రామానికి చెందిన వంకదార విఘ్నేశ్వరరావు అదే గ్రామంలో బంగారు దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి సాయంత్రం షాపు మూసివేసి ఇంటికి వెళ్లాడు. ఉదయం షాపు తాళాలు పగులకొట్టి ఉండడంతో గమనించిన స్థానికులు విఘ్నేశ్వరరావుకు సమాచారం అందించారు. దీంతో విఘ్నేశ్వరరావు హుటాహుటిన షాపు వద్దకు వెళ్లి చూడగా షాపులో వస్తువులు గందరగోళంగా పడి ఉన్నాయి. షాపులో ఉన్న 550 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.60 వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు విఘ్నేశ్వరరావు వాపోయాడు. ముసునూరు ఎస్ఐ ఎం.చిరంజీవి, చాట్రాయి ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పర్యాటకం పరుగులు తీసేనా..!

రెండు జిల్లాల్లో పర్యాటక రంగం అభివృద్ధికి మెండుగా అవకాశాలు

ప్రభుత్వాలు మాటల్లో తప్ప.. చేతల్లో ముందుకు సాగని పరిస్థితి

కొల్లేరు, గుంటుపల్లి బౌద్ధ గుహల పరిస్థితి ఏంటి?

పేరుపాలెం బీచ్ అభివృద్ధికి చర్యలు అంతంతమాత్రమే

గోదావరి, సముద్ర తీరంలో రిసార్ట్స్ అభివృద్ధిలోనూ నిర్లక్ష్యమే

నరసాపురంలో ఆహ్లాదకరమైన గోదావరి పరివాహక ప్రాంతం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పర్యాటక రంగం అభివృద్ధిపై ప్రభుత్వం మాటలకు పరిమితం కాకుండా చేతల్లో చూపించాలంటూ జిల్లా ప్రజానీకం కోరుకుంటున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పర్యాటక రంగం అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పర్యాటక రంగం అభివృద్ధి గురించి పదేపదే చెబుతున్న పరిస్థితి ఉంది. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పర్యాటక రంగ అభివృద్ధికి అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు మాట్లాడుతున్నారు. దీంతో జిల్లాలోని పర్యాటక కేంద్రాల అభివృద్ధిపై జనాల్లో చర్చ కొనసాగుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నడుమ ఉన్న కొల్లేరు సరస్సు 77 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద తాగునీటి సరస్సు కొల్లేరు. ఇక్కడికి ఏటా వందల సంఖ్యలో విదేశీ పక్షులు వలస వస్తుంటాయి. ఆటపాకలో ప్రత్యేకంగా పక్షుల కేంద్రం, గుడివాకలంకలో రిసార్ట్ ఉన్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. పర్యాటక ప్రాంతంగా కొల్లేరుకు మంచి గుర్తింపు ఉంది. బోట్ షికారు వంటివి ఏర్పాటు చేసి, రిసార్ట్స్ నిర్మించి సౌకర్యాలు కల్పిస్తే పర్యాటకంగా కొల్లేరు ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఇక్కడి ప్రజలకు సైతం పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా కొల్లేరు పర్యాటక అభివృద్ధిపై సమావేశాలు నిర్వహించడం తప్ప ఒక్క అడుగు ముందుకు పడిన పరిస్థితి లేకుండా పోయింది. కామవరపుకోట గుంటుపల్లి బౌద్ధగుహలకు గొప్ప చరిత్ర ఉంది. అక్కడ వసతులు కల్పిస్తే పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉన్నప్పటికీ ఏ ఒక్కరూ పట్టించుకోని పరిస్థితి కొనసాగుతోంది. పోలవరం నుంచి కుక్కునూరు వరకూ గోదావరి తీర ప్రాంతాల్లో రిసార్ట్స్ ఏర్పాటు చేస్తే పెద్దఎత్తున పర్యాటకులు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. కొల్లేరు పెద్దింట్ల గుడికి అనేక జిల్లా నుంచి పెద్దఎత్తున జనం వస్తుంటారు. అక్కడ సరైన వసతులు లేని పరిస్థితి నెలకొంది. సరైన రవాణా సదుపాయం సైతం లేకుండా పోయింది. ఇలాంటి ప్రాంతాలను గుర్తించి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం పెరగడంతో పాటు, ఎంతో మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంది.

సముద్ర, గోదావరి తీరాల్లో పర్యాటక అభివృద్ధి ఏదీ?

విభజిత పశ్చిమగోదావరి జిల్లాలో సముద్ర, గోదావరి తీరం కిలోమీటర్ల మేర ఉంది. మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌కి ఏటా కార్తీక మాసంతోపాటు, ఇతర సెలవు దినాల్లోనూ పెద్దఎత్తున పర్యాటకులు వెళ్తుంటారు. ఈ ప్రాంతంలో ఇప్పటికీ సరైన సదుపాయాలు లేకుండా పోయాయి. పెద్దఎత్తున రిసార్ట్స్ నిర్మించి పర్యాటకులను ఆకర్షించే అవకాశం ఉన్నా ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. దొంగరావిపాలెం రిసార్ట్స్ వంటివి కొన్ని మాత్రమే ఉన్నాయి. తీరప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయి. పెద్దమల్లంలో రిసార్ట్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పూర్తయినా ఇప్పటికీ ముందుకు సాగని పరిస్థితి. మొళ్లపర్రులోనూ అదే పరిస్థితి నెలకొంది. ఇవి కాకుండా ఏజెన్సీ ప్రాంతం బుట్టాయగూడెం మండలంలోని దొరమామిడి వద్ద గుబ్బాల మంగమ్మ గుడి ప్రాంతం, పశ్చిమలోని భీమవరం, పాలకొల్లులో ఉన్న పంచరామ క్షేత్రాలను పర్యాటకంగా అభివృద్ధి చేసే అవకాశం ఉంది. ప్రభుత్వాలు మాత్రం మాటలకే.. తప్ప చేతల్లో మాత్రం ముందుకు సాగడం లేదు. కూటమి ప్రభుత్వమైనా జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి పరుగులు పెట్టించాలని అంతా కోరుతున్నారు.

ముదినేపల్లిలో నేలనంటిన వరిచేలు

'వాయు'గండమే..!

గాలుల భీభత్సం.. నేలనంటిన పంట చేలు

వర్షం రాకతో రైతులు ఉరుకులు, పరుగులు

తడవకుండా ధాన్యం రాశులపై కప్పిన పరదాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా వీస్తున్న ఈదురుగాలులకు మండలంలో పలు గ్రామాల్లో కోతకొచ్చిన సార్వా వరిచేలు నేలకొరిగాయి. దీనికితోడు శుక్రవారం సాయంత్రం వర్షం జల్లులు పడటంతో రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. మండలంలోని చినపాలపర్రు, పెదగొన్నూరు, ముదినేపల్లి, వడాలి, పెయ్యేరు, బొమ్మినంపాడు, గురజ, దాకరం తదితర గ్రామాల్లో ఈనిక దశ పూర్తయ్యి గింజ తయారై కొద్దిరోజుల్లో కోతలు కోసే తరుణంలో వాయుగుండం ప్రభావంతో శుక్రవారం మండలంలో పలు గ్రామాల్లో కురిసిన వర్షం, వీచిన గాలులకు వరిచేలు నేలనంటాయి. దీంతో పంటకు కొంతమేర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 14 వేల ఎకరాల్లో సార్వా వరి సాగవుతోంది. గత ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన వర్షాలకు మూడు వేల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది. ఇప్పటికే గరువు ప్రాంత గ్రామాలు చిగురుకోట, అల్లూరు, చినకామనపూడి, బొమ్మినంపాడు తదితర గ్రామాల్లో సుమారు ఐదెకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. మండలవ్యాప్తంగా ఇంకా ఆరు వేల ఎకరాల్లో కోతలు కోయాల్సి ఉంది. పంట చేతికొచ్చిన తరుణంలో రైతులు వరి పంట కోసేందుకు సిద్ధపడుతుండగా వాయుగుండం ప్రభావంతో వ్యవసాయ అధికారుల సూచన మేరకు రైతులు కోతలు వాయిదా వేశారు. మరో రెండు, మూడు రోజుల వరకు కోతలు కోయొద్దని మండల వ్యవసాయాధికారి వేణుమాధవ్ రైతులకు సూచించారు. ఇప్పటికే యంత్రాల ద్వారా కోసిన ధాన్యాన్ని తేమశాతం తగ్గించేందుకు కల్లాల్లో, రోడ్ల వెంబడి ఆరబెట్టుతున్న రైతులు శుక్రవారం సాయంత్రం వర్షం పడటంతో ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు ఉరుకులు, పరుగులు తీశారు. ఆరబెట్టిన ధాన్యం రాశులుగా చేసి పరదాలు కప్పి రక్షణ చర్యలు చేపట్టారు. పంట చేతికొచ్చి మాసూళ్ళ ముమ్మరంగా జరుగుతున్న తరుణంలో వాయుగుండం ఏర్పడి రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు వారి శాఖల ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాల సాధన పూర్తి చేసేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు హాలులో జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో వారి శాఖల ప్రణాళిక లక్ష్య సాధనపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల ప్రణాళికలో భాగంగా జిల్లాలోని వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పరిశ్రమలు, విద్య, వైద్యం, రోడ్లు, భవనాలు, ఐసిడిఎస్, పౌర సరఫరాలు, పంచాయతీరాజ్, డిఆర్‌డిఎ, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాల సాధనపై సమీక్షించారు. ఆయా పనుల లక్ష్యాలను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఏలూరు జిల్లాను రాష్ట్ర స్థాయిలో ముందుస్థానంలో నిలిపేలా అధికారులు కృషి చేయాలన్నారు. లక్ష్యాల సాధనపై ఆయా శాఖలు రూపొందించిన నివేదికలను పరిశీలించి సంబంధిత అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ఠ, డిఇఒ వెంకట లక్ష్మమ్మ, జిల్లా వ్యవసాయశాఖాధికారి హబీబ్ భాషా, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆదిశేషు, ఉద్యాన శాఖాధికారి రామ్మోహన్, ఐసిడిఎస్ పీడీ పద్మావతి, గృహనిర్మాణ శాఖాధికారి శ్రీనివాస్, ఏలూరు మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు .

గోపీమూర్తిని ఎంఎల్‌సిగా గెలిపించాలి

ప్రజాసంఘాల ప్రచారం

మాట్లాడుతున్న సాయికిరణ్

ప్రజాశక్తి - కుక్కునూరు

శాసనమండలి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తిని గెలిపించాలని ప్రజాసంఘాల ఆధ్వర్యాన మండలంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ మాట్లాడుతూ పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మరణం తర్వాత జరుగుతున్న ఉప ఎన్నికల్లో గోపీమూర్తిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉద్యోగ, కార్మిక, పెన్షనర్ల, నిర్వాసితుల గొంతుకగా నిలిచిన సాబ్జీ వారసునిగా పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలో ఉన్న గోపీమూర్తికి ఎన్నో పోరాటాల అనుభవం ఉందన్నారు. ప్రజా సమస్యలపై నికరంగా నిలబడేది పిడిఎఫ్ ఎంఎల్‌సిలేనన్నారు. వచ్చే నెల ఐదో తేదీన జరిగే ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఉపాధ్యాయులంతా మొదటి ప్రాధాన్యతా ఓటు గోపీమూర్తికి వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బుయ్యన శ్రీను, యుటిఎఫ్ మండల అధ్యక్షులు వాంకుడోత్ నాగేశ్వరరావు, నాయకులు సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆక్వారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్

మహాసభలో కలిదిండి ప్రాంతీయ కమిటీ కార్యదర్శిగా మహంకాళిరావు



మాట్లాడుతున్న డిఎన్‌విడి.ప్రసాద్

ప్రజాశక్తి - కలిదిండి

ఆక్వారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, కార్మికులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని భాస్కరరావుపేటలో సిపిఎం కలిదిండి ప్రాంతీయ ఏరియా రెండో మహాసభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్వా రంగం ద్వారా మండలం నుంచి ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం వస్తున్నప్పటికీ, ఆక్వా రంగంలో పనిచేస్తున్న కార్మికులకు భద్రత లేకుండా పోయిందన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని కోరారు. మేతలు, మందుల ధరలు పెరుగుతున్నా చేప, రొయ్య ధరలు పెరగకపోవడంతో ఆక్వా రైతులు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని అప్పుల పాలవుతున్నారన్నారు. స్థిరమైన గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు విద్యుత్ రాయితీలను పెంచి ఆక్వా రైతులకు భరోసా కల్పించాలన్నారు. ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం ఇస్తున్న ఇక్కడి ప్రజలు కాలుష్యంతో అనారోగ్యాల బారిన పడుతు న్నారన్నారు. ప్రత్యేక నిధులు కేటాయించి మంచి నీటి కాలువలను ప్రక్షాళన చేయడం, రోడ్లు అభివృద్ధి పరచడం వంటి మౌలిక సదుపాయాలు చేపట్టా లన్నారు. లంక గ్రామాల్లో తరతరాలుగా ఇరిగేషన్ భూముల్లో నివాసం ఉంటున్న వందలాది కుటుంబాల వారికి వెంటనే పట్టాలు మంజూరు చేయాలన్నారు. తొలుత పార్టీ జెండాను సిపిఎం సీనియర్ నాయకులు వీరవల్లి భాస్కరరావు ఆవిష్కరించారు.

నూతన కార్యదర్శిగా శేషపు మహంకాళిరావు

కలిదిండి ప్రాంతీయ కమిటీ నూతన కార్యదర్శిగా శేషపు మహంకాళిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా వి.భాస్కరరావు, జె.మహేష్, కె.శ్రీనివాసరావు, జి.వినోద్‌కుమార్, సిహెచ్.మాధవ, జె.ఏసు ఎన్నికయ్యారు.

ఉపాధ్యాయుల సెలవులపై ఆంక్షలు విధించలేదు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

కలెక్టర్‌కు వినతి అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఉపాధ్యాయులకు సెలవుల మంజూరు విషయంలో ఎటువంటి ఆంక్షలూ విధించలేదని, ఆ ప్రచారం అవాస్తవమని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. ఇటీవల ఉపాధ్యాయులకు సెలవుల మంజూరులో ఆంక్షలు విధించారని ఉపాధ్యాయులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులను కలెక్టర్ తన ఛాంబర్‌కు పిలిపించి మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు వ్యక్తిగత సెలవులు 10 శాతానికి మించి ఇవ్వొద్దని తాను ఆదేశాలు జారీ చేశానన్న విషయం అవాస్తవమన్నారు. తాను అటువంటి ఆదేశాలు జారీ చేయలేదన్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయులు ఎటువంటి ఆందోళనా చెందొద్దన్నారు. ఉపాధ్యాయులు, సంఘాల ప్రతినిధులు ఇటువంటి అవాస్తవాలను వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి సున్నిత సమాచారం తెలిసినప్పుడు సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ముందుగా ధ్రువపరచుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే ఎంఇఒ, లేదా డిఇఒను కలిసి తెలిపితే పరిష్కారానికి వారు చర్యలు తీసుకుంటారని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ ను కలిసిన వారిలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాల నేతలు ఉన్నారు.

అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు

అంబులెన్స్ నిర్వాహకులకు, డ్రైవర్లకు జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం హెచ్చరిక

మాట్లాడుతున్న జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అనారోగ్య సమస్యలతో ఆసుపత్రి వద్ద పడిగాపులు పడుతున్న రోగుల వద్ద నుంచి, వారి బంధువుల వద్ద నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అంబులెన్స్ నిర్వాహకులను, డ్రైవర్లను జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం హెచ్చరించారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి వద్ద ప్రయివేట్ అంబులెన్స్‌ల నిర్వాహకులు తమ ఇష్టం వచ్చినట్లు దందా చేస్తూ రోగులను అత్యవసర సమయాల్లో వేరొక ఆసుపత్రికి తరలించే సమయంలో వారి వద్ద నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఏలూరు జిల్లా ఉపరవాణ కమిషనర్ షేక్ కరీం అంబులెన్సుల నిర్వహకులు, డ్రైవర్లతో ఉపరవాణ కమిషనర్ ఆయన కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప రవాణా కమిషనర్ కరీం, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ భీమారావు సంయుక్తంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరీం మాట్లాడుతూ మోటార్ వాహన చట్టం ప్రకారం అంబులెన్స్ నిర్వాహకులు నిర్ణీత దూరాలకు నిర్ణీత రుసుములను మాత్రమే వసూలు చేయాలనే నిబంధనలు ఉన్నాయని చెప్పారు. అంతేకాకుండా తమ ఇష్టం వచ్చినట్లు రుసుములు వసూలు చేసి రోగులను, వారి బంధువులను ఇబ్బందులకు గురి చేస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సున్న నుంచి 20 కిలోమీటర్లకు ఒక రుసుము, 20 కిలోమీటర్ల నుంచి 50 కిలోమీటర్లకు ఒక రుసుము, 50 నుంచి వంద వరకు ఒక రుసుము ఇలా నిర్ణీత ధరలను మాత్రమే వసూలు చేయాలని ఆయన సూచించారు. అలాకాకుండా అక్రమంగా పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని, మరోమారు ఇటువంటివి పునరావృతం చూసుకోవాలని ఆయన యూనియన్ నాయకులకు సూచించారు. అసలే అనారోగ్య సమస్యలు, మరోపక్క ఆర్థిక సమస్యలతో ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వచ్చే రోగుల వద్ద నుంచి ఇలా అక్రమ వసూళ్లకు పాల్పడరాదని, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని చెప్పారు. అంబులెన్సుల నిర్వహణ ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని, వాటి పత్రాలు కూడా ఎప్పటికప్పుడు పునరుద్ధరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జి.ప్రసాద్, బి.శేఖర్, మహమ్మద్ జమీర్ పాల్గొన్నారు.

ఐఐటి మద్రాస్ ఎన్‌పిటిఇఎల్ కోర్సులు అమలు

నూజివీడు ఆర్‌జియుకెటి ప్రొఫెసర్ అమరేంద్రకుమార్

మద్రాస్ ఎన్‌పిటిఇఎల్ బృందంతో ఆర్‌జియుకెటి బృందం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఆర్‌జియుకెటిలో చదువుతున్న విద్యార్థులకు ఎన్‌పిటిఇఎల్ కోర్సులను అమలు చేయడానికి ఆ బృందంతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఇందులో భాగంగా ఆర్‌జియుకెటి నాలుగు క్యాంపస్‌లలో చదువుతున్న విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ఫీజు సడలింపు కల్పించాలని, ఆర్‌జియుకెటి విద్యార్థులకు ఒక పరీక్ష కేంద్రాన్ని స్థాపించాలని అభ్యర్థించగా ఐఐటి మద్రాస్ ఎన్‌పిటిఇఎల్ బృందం సానుకూలంగా స్పందించింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్‌జియుకెటిలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు రెండు ఎలెక్టివ్‌లు, ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఒక అలెక్టివ్‌ను ఎన్‌పిటిఇఎల్ ద్వారా అందించాలని ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ఈ విధానం విశ్వవిద్యాలయంలో బోధకుల కొరతను పరిష్కరించడంలో సహాయపడటమే కాకుండా బోధన నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుందని తెలిపారు.

'అపార్' సమస్యలు పరిష్కరించాలి

తహశీల్దార్‌కు సిపిఎం వినతి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - కుక్కునూరు

జనన ధ్రువీకరణ పత్రాలు పారదర్శకంగా ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి బుయ్యన శ్రీను డిమాండ్ చేశారు. విద్యార్థులు, విద్యార్థుల తలితండ్రులు అపార్‌లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్‌కి సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ ఆధార్ కార్డులో ఎటువంటి తేడాలు లేకుండా పేరులో ఒక్క అక్షరం కూడా తేడా లేకుండా ఉంటేనే రిజిస్ట్రేషన్ అవుతుందన్నారు. తేడా ఉన్న విద్యార్థులను ఆధార్ కేంద్రానికి వెళ్లి మార్చుకోమని ఉపాధ్యాయులు చెప్తే విద్యార్థి తలిదండ్రులు వెళ్లి మార్చమని అడిగితే 18 ఏళ్లతక్కువ ఉన్న ప్రతిఒక్కరూ ఆన్‌లైన్ నుంచి తీసుకున్న జనన ధ్రువీకరణ పత్రం కచ్చితంగా కావాల్సిందేఅని చెప్పడంతో, జనన ధ్రువీకరణ పత్రం కోసం నాన్ అవైల్‌బులిటి సర్టిఫికేట్, లాయర్ నోటరీ కావాలని అడిగితే అవి తీసుకుని సచివాలయంలో ఆన్‌లైన్ చేయించినా కొన్ని రిజెక్ట్ అవుతున్నాయన్నారు. కొంత మందికి ఎలా తెచ్చుకోవలో అర్థం కాక ఆందోళన చెందుతున్నారన్నారు. ఇదే అదునుగా కొంత మంది దళారులు ఆసరాగా తీసుకుని రూ.4 వేల నుంచి ఆరు వేల వరకు తీసుకుంటున్నారన్నారు. చెల్లించలేని విద్యార్థులు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారన్నారు. ప్రభుత్వం అపార్ రిజిస్ట్రేషన్‌కి అవసరమైన మార్పులు ప్రధానోపాధ్యాయులు, తహశీల్దార్ డిక్లరేషన్ ఇస్తే మార్చే విధంగా, మొత్తం విద్యార్థులకు రిజిస్ట్రేషన్ పూరయ్యేవరకు మండలంలో ప్రత్యేక క్యాంపులు పెట్టి రిజిస్ట్రేషన్‌లు చేయాలని, జనన ధ్రువీకరణ పత్రాల జారీలో పారదర్శకంగా వ్యవహరించేలా తగు చర్యలు తీసుకోవాలని శ్రీను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు, సిపిఎం మండల కమిటీ సభ్యులు యర్నం సాయికిరణ్, షేక్ వలిపాషా, శ్యామల లక్ష్మణరావు, పులదాసు రమేష్ పాల్గొన్నారు.

వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొత్త వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్లు వెంటనే మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్ల సమస్యపై వారు ఏలూరు అన్నే భవనంలో మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 720 కొత్త వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బోర్ల పైన ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులకు నీరు అందడం లేదన్నారు. వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల రైతుల నుంచి విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది విద్యుత్ కనెక్షన్ల మంజూరు కోసం లంచాలు తీసుకోవడం దారుణమని విమర్శించారు. విద్యుత్ కనెక్షన్ల మంజూరులో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త వ్యవసాయ బోర్లకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు వెంటనే విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని కోరారు. లేకపోతే రైతులను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ర్యాలీలో హెచ్ఎం షేక్ మహమ్మద్ అలీ, విద్యార్థులు

ఆహార తయారీపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యార్థులు ఆహార సంరక్షణ, తయారుచేసే విధానంపై అవగాహన కలిగి ఉండాలని బొర్రంపాలెం హైస్కూల్ హెచ్ఎం షేక్ మహమ్మద్ అలీ సూచించారు. మండలంలోని బొర్రం పాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ లెర్నింగ్ లిమిటెడ్ వారి సహకారంతో ఉపాధి ఒకేషనల్ ప్రాధాన్యతగల ట్రేడ్ ఆహార తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. 9, 10, ఇంటర్ విద్యార్థులను స్థానిక బేకరీకి తీసుకెళ్లి కేకులు, బ్రెడ్, పఫ్‌లు తయారీ విధానం నేర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వృత్తిగత నైపుణ్యం కలిగి ఉండడం ద్వారా ఉపాధి అవకాశాలు పొందుతారన్నారు. ఆహార తయారీపై అవగాహనతో పాటు నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. తద్వారా స్వయంగా ఉపాధి పొందొచ్చన్నారు.

గుండెపోటుతో ఎంఎంసి మాజీ డైరెక్టర్ మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వడాలి గ్రామానికి చెందిన గురువు సుబ్రహ్మణ్యం (55) గుండెపోటుతో శుక్రవారం మరణించారు. సుబ్రహ్మణ్యం నలుగు సార్లు టిడిపి గ్రామ అధ్యక్షునిగా, ఉత్తమ రైతుగా, కలిదిండి మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా సేవలందించారు. సుబ్రహ్మణ్యం మరణ వార్త తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పలువురు పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు మృతదేహాన్ని సందర్శించి అంజలి ఘటించి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. సుబ్రహ్మణ్యం అంత్యక్రియలు శనివారం ఉదయం తొమ్మిది గంటలకు వడాలిలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


సుబ్రహ్మణ్యం (ఫైల్‌ఫొటో)

సీసీ రోడ్ల నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - నిడమర్రు

మండలంలోని క్రొవ్విడి గ్రామంలో ఎంజిఎన్‌ఆర్‌జిఇఎస్ నిధులు రూ.40 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ ఎంఎల్ఎ ధర్మరాజు పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకుని, రోడ్ల పనిలో నాణ్యతా ప్రమాణాలు పాటించి, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న కూటమి ప్రభుత్వం పారదర్శక, జవాబుదారీతనంతో పెంపొందించే దిశగా గ్రామసభలను పెట్టి వాటి నిర్మాణం ప్రజల చేత ఆమోదించబడిన పనులు కార్యరూపం దాల్చేలా కొత్త పరిపాలనకు నాంది పలికినట్లు తెలిపారు. కార్యరూపం దాల్చిన పనుల వివరాలు ప్రజలకు తెలిపేలా పల్లె పండుగ వంటి కార్యక్రమం ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ సంకల్పంగా తెలిపారు. ముందు చెప్పినట్లుగానే నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, నిర్ణీత గడువులో పనులను పూర్తి చేసి, గ్రామ ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో శరవేగంగా పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

కంప్యూటరీకరణ పేరుతో సహకార సంఘాలపై ఒత్తిడి

ఉద్యోగులపై పని భారం మోపడం సరికాదు

ఏపి కోఆపరేటివ్ సొసైటీ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు అజయ్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీపై కంప్యూటరీకరణ పేరుతో విపరీతంగా మానసిక ఒత్తిడి తెస్తున్నారని ఏపి కోఆపరేటివ్ సొసైటీ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్ కుమార్ విమర్శించారు. ఎటువంటి శిక్షణ ఇవ్వకుండా ఉద్యోగులపై పని భారం మోపడం సరైంది కాదన్నారు. భీమవరం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ వద్ద సహకార సంఘం జిల్లా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకార వ్యవస్థను ప్రయివేటీకరణ చేయడం కోసం రాష్ట్ర హక్కుగా ఉన్న సహకార వ్యవస్థను కేంద్రం ఖాతాలోకి తీసుకు వెళ్లిందని విమర్శించారు. కంప్యూటర్ అవసరమని కాని, ముందస్తుగా ఎటువంటి శిక్షణ ఇవ్వకుండా, దానికి కావలసిన సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేయకుండా ఉద్యోగులపై భారం మోపడం సరైంది కాదని విమర్శించారు. సహకార సంఘ ఉద్యోగులకు గత ఏడిమిదేళ్ల నుంచి వేతన సవరణ జరగలేదన్నారు. 36 జి.ఓ సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి సహకార సంఘ ఉద్యోగులకు విపరీతమైన పని ఒత్తిడి కలుగుతున్నారు. సొసైటీలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, దానికి కావలసిన సిబ్బంది నైపుణ్యం కలిగించాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. నామమాత్రపు శిక్షణ ఇచ్చి ఉద్యోగులపై ఒత్తిడి చేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం నుంచి, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నుంచి రావలసిన వివిధ బకాయిలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సహకార సంఘం నేతలు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని దిబ్బగూడెం గ్రామ పరిసర ప్రాంతాల్లో జంగారెడ్డిగూడెం డివిజన్ ఎక్సైజ్ సిఐ కె.శ్రీనుబాబు ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన ఒక మహిళ వద్ద తెలంగాణ రాష్ట్రానికి చెందిన 25 మద్యం బాటిళ్లను గుర్తించినట్లు తెలిపారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.శ్రీనుబాబు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు వెంకటలక్ష్మి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నాసిరకం విత్తనాలు.. అన్నదాత అవస్థలు

మొక్కజొన్న సీడ్స్ వ్యాపారుల మాటలు నమ్మి మోసపోతున్న వైనం

అధిక దిగుబడి వస్తుందని, రాకపోతే నగదు ఇస్తామని హామీ

దిగుబడి రాక, నగదు అందక నష్టపోతున్న రైతులు

ప్రజాశక్తి - చింతలపూడి

నాసిరకం మొక్కజొన్న విత్తనాలతో అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు. తక్కువ ధర, అధిక దిగుబడి, త్వరగా పంట చేతికొస్తుందని నమ్మించి కొందరు వ్యాపారులు రైతులను నట్టేట ముంచుతున్నారు. దళారులు రైతులకు మాయమాటలు చెప్పి నాసిరకం మొక్కజొన్న విత్తనాలను విక్రయిస్తున్నారు. రైతులు వారి మాటలు నమ్మి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందని ఆశ పడి పంటలు వేయటంతో అనుకున్న లాభాలు రాక నష్టపోతున్నారు.

చింతలపూడి మండలంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న మొక్కజొన్న సీడ్స్, వ్యాపారుల చేతుల్లో రైతులు మోసపోతున్నారు. ప్రతి ఏడాది కొత్త సీడ్స్‌తో రైతుల వద్దకు వచ్చి ఎకరానికి నాలుగు నుంచి ఐదు టన్నులు అవుతుందని నమ్మిస్తున్నారు. పంట పండకపోయినా ఎకరానికి రూ.70 వేలు ఇస్తామని మొక్కజొన్న సీడ్స్ యజమానులు చెప్పే మాయమాటలు నమ్మి రైతులు మోసపోతున్నారన్నారు. నాలుగు నుంచి ఐదు టన్నులు అవ్వకపోగా ఎకరానికి ఇస్తామన్న రూ.70 వేలు కూడా ఇవ్వకపోవడంతో రైతులు నష్టపోతున్నారు.

మండలంలోని గని చర్ల, ముక్కంపాడు గ్రామాల రైతులు మొక్కజొన్న సీడ్స్ వ్యాపారుల మాటలు విని మోసపోయారు. ఎకరానికి నాలుగు నుంచి ఐదు టన్నులు అవుతుందని సీడ్స్ వారు నమ్మించారు. పంట 4, 5 టన్నులు అవ్వకపోయినా ఎకరానికి రూ.70 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో మొక్కజొన్న పంట వేయగా అనుకున్న పంట దిగుబడి రాలేదు. వారు ఇస్తామన్న రూ.70 వేలు ఇవ్వాలని అడుగగా కొంత సొమ్ము ఇచ్చి మిగతాది ఇవ్వకపోవడంతో రైతులు తమకు న్యాయం చేయాలని, నష్ట పరిహారం ఇప్పించాలని కోరుతూ పోలీసులు, అగ్రికల్చర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

మొక్కజొన్న సీడ్స్‌పై అధికారులు దృష్టి పెట్టాలి

ఇప్పటికే మొక్కజొన్న పంట సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. మొక్కజొన్న సీడ్ వ్యాపారులు కూడా తమ సీడ్ వేసుకోవాలని గ్రామాల్లో తిరుగుతున్నారు. ఎకరానికి నాలుగు నుంచి ఐదు టన్నుల వరకు అవుతుందని రైతులను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. మండలంలో ఏ రకం సీడ్ వచ్చినా పూర్తిగా తెలుసుకున్న తర్వాత వేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

విజయరాజు, రైతు, గణిజర్ల

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి అవుతుందని, ఎక్కువ లాభాలు పొందవచ్చని మొక్కజొన్న వ్యాపారులు చెప్పిన మాయమాటలు నమ్మి మోసపోయాను. నాతో పాటు మరికొంతమంది రైతులూ మోసపోయారు. ఎకరానికి నాలుగైదు టన్నులు దిగుబడి అవుతుందని, లేకపోతే ఎకరానికి రూ.70 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. అధిక దిగుబడిం రాలేదు. ఎకరానికి ఇస్తానన్న రూ.70 వేలు కూడా ఇవ్వడంలేదు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా వారు కూడా పట్టించుకోవడంలేదు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలి.

నా దృష్టికి రాలేదు

ఎఒ మీనాకుమారి

ఈ సమస్య నా దృష్టికి రాలేదు. రైతులు కూడా నాకు ఫిర్యాదు చేయలేదు. వారు వస్తే న్యాయం చేస్తాను.

ఏలూరును హెచ్ఐవి రహిత జిల్లాగా చేయాలి

డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ట

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు జిల్లాను హెచ్ఐవి/ఎయిడ్స్ రహిత జిల్లాగా చేయాలనే లక్ష్యంతో అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.శర్మిష్ట తెలిపారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ప్రతి ఏడాది ప్రపంచ ఎయిడ్స్ దినం డిసెంబర్ ఒకటో తేదీన ప్రజలకు అవగాహన కల్పించేదుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29, 30వ తేదీల్లో రెండు రోజుల పాటు ప్రజలకు హెచ్ఐవి/ఎయిడ్స్, సుఖవ్యాధులు, టిబి వ్యాధులపై అవగాహన కల్పించేందుకు ఒక సమాచార ప్రచార కేంద్రాన్ని (ఐఇసి స్టాల్) ఏలూరు కొత్త బస్టాండ్‌లో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సమాచార ప్రచార కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.శర్మిష్ట, జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టిబి అధికారి డాక్టర్ ఎం.నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.శర్మిష్ట మాట్లాడుతూ ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా జిల్లాలో అనేక అవగాహన కార్యక్రమాలు హెచ్ఐవి/ఎయిడ్స్‌పై విస్తృత ప్రచారం చేస్తున్నామని తెలిపారు. డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టిబి అధికారి మాట్లాడుతూ 30వ తేదీ శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ప్రాంగణంలో ట్రాన్స్ జెండర్లకు హెచ్ఐవి బాధిత మహిళలకు, వారి కుటుంబ సభ్యులకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని, అనంతరం కొవ్వొత్తులతో ప్రదర్శన ఉంటుందని తెలిపారు. డిసెంబర్ ఒకటో తేదీన వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉదయం 8.30 గంటలకు సమాజం వివక్షత తగ్గించే లక్ష్యంతో హెచ్ఐవి బాధిత పిల్లలు, వారి కుటుంబ సభ్యులు, ట్రాన్స్ జెండర్లు జిల్లా అధికారులతో కలిపి సామూహిక అల్పాహారం చేసే కార్యక్రమం నిర్వహిస్తామని, అనంతరం వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సిబ్బందితో, విద్యార్థులతో అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏలూరు జిల్లాను హెచ్ఐవి/ఎయిడ్స్ రహిత జిల్లాగా చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ పి.బాలాజీ, జిల్లా సూపర్‌వైజర్ ఎన్.హరినాథరావు, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార ప్రచార కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ శర్మిష్ట

ఆ బస్సులో ప్రయాణం... నరకప్రాయం

మోతలతో ప్రయాణికుల ఇబ్బందులు

మరమ్మతులు చేయాలని వేడుకోలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు నుంచి ద్వారకాతిరుమలకు నడుపుతున్న ఆర్‌టిసి బస్సులో ప్రయాణించేందుకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. బస్సు లోపల విపరీతమైన మోతలకు చెవులకు చిల్లులు పడుతున్నాయని ప్రయాణికులు హడలిపోతున్నారు. నూజివీడు డిపో మేనేజర్ బస్సుల మరమ్మతుల విషయం పట్టించుకోవటం లేదని విమర్శిస్తున్నారు. డబ్బులు చెల్లించి టిక్కెట్ తీసుకొన్న తమకు మోతల బాధ ఏంటని నిలదీస్తున్నారు. నూజివీడు డిపోలో లైట్లు, సిగ్నల్ లైట్లు లేని బస్సులు చాలా ఉన్నాయని, ఇటు ప్రయాణికులు, అటు డ్రైవర్ల జీవితాలతో ఆడుకుంటుందని పలువురు ఆగ్రహిస్తున్నారు. నూజివీడు యాజమాన్యం తక్షణమే స్పందించి ద్వారకాతిరుమల వెళ్లే ప్రయాణికులు, భక్తులకోసం మంచి కండీషన్‌లో ఉన్న బస్సును నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయంపై డిపో మేనేజర్‌ని వివరణ కోరగా వెంటనే మరమ్మతులు చేపిస్తామని తెలిపారు.

మరమ్మతులకు గురైన నూజివీడు డిపో బస్సు

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నిర్మూలన

జిల్లా మలేరియా అధికారి పిఎస్.ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

దోమ చాలా ప్రమాదకరమైన కీటకమని, దోమల నిర్మూలన పరిసరాల పరిశుభ్రతతో సాధ్యపడుతుందని ఏలూరు జిల్లా మలేరియా అధికారి పిఎస్.ప్రసాద్ సూచించారు. ఏలూరులోని వెంకటాపురం-3 సచివాలయం పరిధిలో శ్రీరామ్‌నగర్‌లో డ్రైడే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కువ వ్యాధులు దోమ కొట్టడం వల్లే సంభవిస్తాయన్నారు. మనకు ఎక్కువగా హాని చేసే దోమలు మన గృహం లోపల ఎయిర్ కూలర్స్, ఫ్రిడ్జ్ వెనక బాక్స్, గ్రైండర్స్, అదేవిధంగా ఇంటి బయట నీళ్ల తొట్టెలు, డ్రమ్ములు, మూతలు లేని బావులు, పల్లపు నీటి ప్రాంతాలు వంటి స్థానాల్లో పెరుగుతాయన్నారు. ప్రతిఒక్కరూ వారానికొకసారి వాటిని శుభ్రం చేసుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. మంచినీటి నిల్వ ప్రాంతంలో డెంగీ దోమ, మలేరియా దోమ పెరుగుతాయనానరు. మంచినీళ్ల వారానికి పైబడి నిల్వ ఉంచరాదని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, సిహెచ్.రమేష్‌బాబు, ఆరోగ్య కార్యకర్తలు జ్యోతిశ్రీ, సునీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీలో జిల్లా మలేరియా అధికారి ప్రసాద్

వ్యాపార కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

నూజివీడు డిఎస్‌పి ప్రసాద్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణ పరిధిలోని పైడి అప్పారావు మర్చంట్స్ హాలు వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు డిఎస్‌పి ప్రసాద్ మాట్లాడుతూ వ్యాపార కూడళ్లలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. వ్యాపార దుకాణ సముదాయాలకు నిత్యం కనీసం వందమంది వచ్చి వెళ్తూ ఉంటే అనేక సంఘటనలు చోటు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఎలాంటి దురదృష్టకర సంఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోతే మొదటిసారి రూ.ఐదు వేలు, రెండో సారి రూ.పది వేలు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. రెండు పర్యాయాలు జరిమానా విధించినా తీరు మారకపోతే అలాంటి వ్యాపార సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుత సమాజంలో అనేక ప్రమాదకర సంఘటనలు నిత్యం చూస్తున్నామని, సీసీ కెమెరాలు ఏర్పాటుతో ఎలాంటి సంఘటనలు జరిగినప్పటికీ బేరీజు వేసుకొని తక్షణ చర్యలు చేపడతామని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నిందితులను శిక్షించడం ఎంతో సులభతరం అవుతుందని స్పష్టం చేశారు. వ్యాపారాల సముదాయాల వద్ద సీసీ కెమెరాలు నిఘా ఏర్పాటు చేయడంతో ఆగంతకులు, ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందని సోదాహరణంగా వివరించారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి ప్రసాద్

కిశోర బాలికల వికాసంపై అవగాహన కల్పించాలి

ఉంగుటూరులో...

ప్రజాశక్తి - ఉంగుటూరు

కిశోర బాలికల వికాసంపై మహిళా పోలీసులు, వెల్ఫేర్ సహాయకులు, అంగన్వాడీలు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ రాజ్‌మనోజ్ అన్నారు. మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా కిషోర్ బాలిక వికాసం-2.0 అంశంపై శిక్షణ, అవగాహన కార్యక్రమం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. మహిళా పోలీసులు, వెల్ఫేర్ రెస్టారెంట్లకు, ఐసిడిఎస్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ఎంపిడిఒ రాజ్‌మనోజ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిశోర బాలిక వికాసం 2.0 కార్యక్రమంలో భాగంగా లింగ వివక్షత, సంపూర్ణ ఆహారం ఆరోగ్యం, నాణ్యమైన విద్య, వ్యక్తిగత రుతుస్రావ పరిశుభ్రత, బాలికలపై లైంగిక వేధింపులను నుంచి రక్షణ, బాల్య వివాహాలను అరికట్టడం, మానవ అక్రమ రవాణాను అరికట్టడం, బాలికల్లో ఆత్మ రక్షణ చర్యలను నేర్పటం, నైపుణ్యం ఉపాధి కల్పన, తదితర అంశాలపై, గ్రామాల్లో ఖాళీగా ఉన్న కిశోర బాలికలను గుర్తించి వారికి అంశాల్లో శిక్షణ ఇవ్వాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. అంతేకాకుండా కిశోర బాలికలను గుర్తించి వారికి ఇష్టమైన అంశాల్లో శిక్షణను ఉచితంగా ఇప్పించి చదువు కొనసాగించడం కోసం, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ కల్పించనున్నట్లు తెలిపారు. బాల్య వివాహాల రహిత మండలంగా మార్చాలని మహిళా పోలీసులకు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు, ఐసిడిఎస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.

నిడమర్రులో...

నిడమర్రు : కిశోర బాలిక వికాసం 2.0 కార్యక్రమం గురించి మండల స్థాయి సమీక్ష సమావేశం నిడమర్రు ఎంపిడిఒ కార్యాలయంలో నోడల్ ఆఫీసర్, ఎంపిడిఒ విజయకుమారి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. గ్రామస్థాయిలో ఆచరించాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. గ్రామ స్థాయి కమిటీలకు శిక్షణ సమావేశం వచ్చే నెల మూడో తేదీన నిర్వహించనున్నటు తెలపారు. ఈ సమావేశంలో మండల స్థాయి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యాసాగర్

పొగాకు సాగు విస్తీర్ణాన్ని తగ్గించాలి

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలో పొగాకు సాగు విస్తీర్ణాన్ని తగ్గించుకోవాలని నూజివీడు సహాయ వ్యవసాయ సంచాలకులు జి.విద్యాసాగర్ రైతులకు సూచించారు. మండల కేంద్రమైన వ్యవసాయ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ నూజివీడు డివిజన్‌లోనే ముసునూరు మండలంలోని గోపవరం, కాట్రేనిపాడు, స్థానిక ముసునూరు గ్రామాల్లో ఎక్కువ శాతం పొగాకు విస్తరణ సాగు చేయటం వల్ల ఆ పంట మళ్లీ మానవ వినియోగానికి ఉపయోగించటంతో కేన్సర్ వంటి రోగాలు వచ్చి మరణాలు రేటు పెరిగే అవకాశం ఉందన్నారు. పొగాకు పంట సాగు చేయడంలో తగ్గించాలని, ఇతర పంటలైన మిర్చి, మొక్కజొన్న, మినుము, పత్తి పలు పంటలను సాగు చేస్తే రైతులు, మానవులు కూడా ఆరోగ్యకరంగా ఉంటారని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.మధుమోహన్, రైతులు, పకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం సత్యవరం గ్రామానికి చెందిన పీతల మణి కుమారి ఒరిజినల్ పాస్ పోర్ట్ **నెం. V547558** తీసుకుని సత్యవరం నుండి పెనుగొండ మోటర్ సైకిల్ పై వెళ్ళుతుండగా మార్గం మధ్యలో పడిపోయింది దొరికిన వారు క్రింది అడ్రస్కు అందజేయగలరు.

అడ్రస్ **పీతల మణికుమారి**
భర్త సత్యనారాయణ, డోర్ నెం. 3-95A
సత్యవరం గ్రామం పెనుమంట్ర
మండలం పశ్చిమగోదావరి జిల్లా
సెల్ నెం. 9490179919

దస్తావేజులు పోయినవి

నా క్లయింటు పశ్చిమ గోదావరి జిల్లా, ఉండి మండలం, ఉండి కాపురస్తులు తాడేపల్లి రాజేంద్ర ప్రసాదరావు గారి కుమారుడు శ్రీరామచంద్రమూర్తి గారు వారి పేరున గల అనగా వారు ది.04.06.2015వ తేదీ ద.నెం.3769/2015రు దస్తావేజులోని ఆస్తికి లింకు దస్తావేజైన అనగా నా క్లయింటు క్రయదారైన ఇమ్మళరాజు నాగేశ్వర వర్మ గారి పేరున గల ది. **15.11.2012**వ తేదీ భీమవరం స.రి.కా.ద.నెం. 6925/2012రు క్రయ దస్తావేజును లోగడ వారు జిరాక్సు నిమిత్తం ఉండి సెంటరుకు వెళ్లుక్రమంలో పోగొట్టుకున్నారని మరియు వారు సదరు దస్తావేజు ఎంతవెతికినను దొరికియుండలేదనిన్నీ తెలిపియున్నారు. కావున సదరు దస్తావేజు ద.నెం.6925/2012 (భీమవరం స.రి.కా) రు పోవుటపై ఎవ్వరికైననూ ఎట్టి అభ్యంతరములు ఉన్న ఎడల ఈ ప్రకటన తేదీ నుండి 3 రోజుల లోపుగా ఈ క్రింది అడ్రస్సునకు తెలియపర్చవలెను. లేనిఎడల సదరు నా క్లయింటు ఆస్తి నిష్పేచ్చీ ఆస్తిగా పరిగణించుదుము.

భీమవరం, **రేలంగి హరి నాగవెంకట సత్యనారాయణ**
తేది. 29.11.2024 అడ్వకేట్, భీమవరం.
సెల్: 9052057507

NOTICE
BEFORE THE COURT OF JUDICIAL MAGISTRATE OF FIRST CLASS AT BANTUMILLI
M.C. NO. 1/2022

Between :
పొన్నాల లక్ష్మీదుర్గ మరియు 2 ఇతరులు... పిటీషనర్స్
వర్సెస్
పొన్నాల చంద్రరాజు .... రెస్పాండెంట్
టు,
పొన్నాల చంద్రరాజు, తండ్రి : పల్లవరాజు, ప్రైవేట్ ఉద్యోగి, తోకతిప్ప గ్రామం, భీమవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా.

పై నెంబరు మనోవర్తి కేసు పైన పేర్కొన్న కోర్టు ఎదుట పెండింగ్‌లో వున్నది. మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. పై కోర్టు వారి ఎదుట ది. 18-12-2024వ తేదీన తమరి హాజరు నిమిత్తం వాయిదా వున్నది. కావున సదరు తేదీ నాడు సదరు కోర్టువారి ఎదుట మీరు ప్రత్యక్షంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ హాజరు కావలయును. అట్లు కాని పక్షంలో మీకు సదరు కేసుకు సంబంధించి పరోక్షంగా తీర్మానించబడునని తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టువారి అనుమతితో)
వాయిదాతేది : 18-12-2024

బంటుమిల్లి.
తేది: 28-11-2024
ఇ.వి.ఎస్.రాయుడు,
పిటీషనర్స్ తరఫు న్యాయవాది.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE AT NUZIVID
EP No. 60/2016 in ABR/CF/No. 172/2014

Margadarsi Chit Fund (P) Ltd.,
Santhosh Nagar Branch, Hyderabad
..... D.H.R.
AND
Mr. T.V.R. Vara Prasad, S/o Krishna Rao, aged 56 years, R/o H.No. 1-8-22/1, Flat No. G-2, Sarathi Apartments, North Kamala Nagar, ECIL (P), R.R. Dist.
(Property situated at Nuzivid, Eluru dist)
.... 1st J.D.R.

పై నెంబరు అమలులో 1వ జెడిఆర్ తాలూకు ఈ క్రింది తెలిపిన ఇ.పి. షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ది. 20-12-2024వ తేదీన పై కోర్టువారి ఎదుట ఉదయం 10-30 గం.లకు బహిరంగ వేలము జరుగునని తెలియపరచటమైనది. కావున వేలంపాటలో పాల్గొనువారు వేలంపాటలో పాల్గొనవచ్చును.

1st JDR Schedule : Krishna District, Nuzivid Sub Register Office వారి యిలాకా Nuzivid Municipality ఏరియాలోని, Nuzivid Mandal, Nuzivid Villageలో Agriculture Land Admeasuring Ac 0-23, 3/4 Cts Or 0.97 Hectors in Survey No. 1005/1, Nuzivid ఏరియాలో గల ఖాళీగా వున్న స్థలమునకు హద్దులు :
North : Badugu Rambabu & E. Rajashekar Land
South : Donka, West : donka
East:Guttikonda Hari Krishna Prasad Land.
Note : Krishna district, Now present Eluru District)
D.H.R. Value : Rs. 4,00,000/-
Ameen Value : Rs. 7,00,000/-
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వేలం వాయిదా : 20-12-2024
ఫరదర్ హియరింగ్ : 27-12-2024

ఇట్లు
ఎం.రమేష్,
అడ్వకేట్, నూజివీడు.